# కళ్లు!

ఎం. శైలజామిత్ర

**చూపు... అదే చూపు ... నిలకడగా ఉన్న ఇంద్రధనుస్సులా... నిన్నే తలంతుననే భావంతో ఉన్న అమర ప్రేమలా... ఆ చూపు గుండెల్లో గుచ్చుకుంటూంటే నిత్యమూ జరిగే పనుల్లో జాప్యం జరుగుతోంది శారదకు.**

ఒకపక్క తాను పెళ్లి కాని పిల్లా కాదు.. పిల్లలు అనునిత్యం 'అమ్మా!' అంటూ.... 'నా టవల్ ఎక్కడ? లుంగీ ఎక్కడ?' అంటూ అనుక్షణం భర్త విసిగిస్తున్నా ...

తనకోసం ఆ చూపులోని మాధుర్యాన్ని అనుభవిస్తూ మరింత ఉత్సాహంగా ఉంటోంది శారద.

ఎన్నడూ లేనంతగా పసితనం కనబడాలని తాపత్రయం కనబడుతోంది.

హెయిర్ కటింగ్, ఐ బ్రోస్ షేపింగ్ ... ఇవన్నీ శారదలో చోటు చేసుకున్నాయి. ఎన్నడూ అద్దం ముందు నిలబడని తాను అనునిత్యం అద్దంముందే నిలబడుతోంది.


ఎప్పుడూ చిర్రుబుర్రులాడే ఆ ముఖంలో తెలియకుండానే తన ప్రమేయం లేకుండానే చిరునవ్వు లాస్యమాడుతోంది.

విసుగు, విరామం లేని జీవితంలో విరక్తి చెందుతున్న ఆ మనసులో జీవితం పట్ల ఆసక్తి, ఏదో సాధించాలనే తపన ప్రస్ఫుటమవుతోంది. ఏదో ఒక వాయిల్ చీరలో పని చేసుకుపోయే శారద ... నిత్యం ఏదో కొత్తదనం కోసం ఆరాటపడుతోంది.

ఒకరోజు పక్క వాటాలో ఉన్న అతను తన బెడ్‌రూమ్ కిటికీలోకి చూడటం గమనించింది. ఎవరితను? ఎందుకిలా చూస్తున్నాడు? దొంగ కాదు కదా ... దొంగతనం చేసేవాడయితే తను చూస్తున్నా చూపు మరల్చడేం? తను కాలేజీ చదివే రోజుల్లో చాలామంది అనగా వింది తనది అసాధారణమైన అందమని. ఇప్పటికీ ఎవరు చూసినా, పెళ్లయి పిల్లలున్నారంటే ఎవ్వరూ నమ్మరు అంటూంటారు. కానీ, ఈ రోజు పిల్లలు... వారికి సేవలు, చదువు... శ్రీవారు ... వారి అవసరాలు ... కట్టుబాట్లు ఈసడింపులతో జీవితంపట్ల విరక్తి పెరిగింది.

తనపట్ల, తన ఆరోగ్యంపట్ల ఏ రోజూ శ్రద్ధ చూపేది కాదు. ఒక్కొక్కప్పుడు "నువ్విలా ఏడుపు ముఖంతో ఉన్నట్లయితే నేను రెండో బ్రాంచ్ తెరవాల్సి వస్తుందోయ్!" అని కూడా అనేవారు. "ఆఁ, పోనీలెండి. నా బాధలు అందరూ భరిస్తారా?" అంటూ సర్దుకుపోయేది.

ఈమధ్య తన భార్య శారద ప్రవర్తనలో మార్పు గమనిస్తూనే ఉన్నాడు. కానీ, ఇంతటి మార్పుకు కారణం ఏదో, ఏమై ఉంటుందో ఊహించలేకపోతున్నాడు. రోజురోజుకూ కొత్త శారదను చూస్తున్నాడు. అదీకాక ఎప్పుడో వదిలేసిన సంగీతాన్ని సాధన చేయటం మరింతగా ఆశ్చర్యపరుస్తోంది. ఎంతో కృషితో అష్టపదులు ఎంతో శ్రావ్యంగా పాడి, ఎప్పుడో మూగబోయిన హృదయానికి శృతిచేసి అలరిస్తోంది. తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచాడు కూడా.



"అబ్బే, ఏమీ లేదండీ! నాకే ఎప్పుడూ అలా ఉంటే ఎలా అనిపించి..." అంటూ సిగ్గు దొంతరల్ని, తెలియని మురిపాన్ని ముఖంలో కనబడీ కనబడనట్లు దాచేసింది.

అది గమనించిన భర్త ఎంతో ఆనందపడి, "నిజమే, శారూ! ఎప్పుడో పెళ్లయిన కొత్తలో చూసిన నిన్ను మళ్లీ ఇలా చూడగలుగుతున్నందుకు నాకు సంతోషంగా ఉంది. అయినా నా కోసమే కదా ఈ అలంకరణలన్నీ! మరి... సాయంత్రం తయారయితే చాలదా?" అన్నాడు ఒక విధంగా భర్త.

ఆ మాటలకు ఖంగుతిన్న శారద "అంటే... నేను తయారమ్యేది మీ కోసమే నన్నమాట! నా కోసం ఏమీ అక్కర్లేదా?" అంటూ బుంగమూతిపెట్టిన శారదను చూస్తే మళ్లీ కొత్త పెళ్లికూతురిలా అనిపించి చటుక్కున ముద్దరేశాడు.

"నిజం, శారూ ! నీలో ఎన్నో ... మాటలో, నడకలో, ప్రతి కదలికలో ఎవరికీ లేనంత అందం ఉంది. అందుకే నాకు భయం! నీ అందం

ఎవరికంటయినా పడిందో, నా కెంత బాధో! .. ఏదో సంసారం, బాధలు, పిల్లలు, రోగాలు ... డబ్బులేమితనం ... ప్చ్.. ముద్దూ ముచ్చటా లేకుండా గడిచిపోయింది!"

"అంటే... ఇది గుర్తించేసరికి అయ్యగారికి ఇన్ని సంవత్సరాలు గడిచిందన్నమాట!" అంది వ్యంగ్యంగా శారద.

"అది తప్పు. నీకు తెలియని దేముంది?"

"అన్నీ తెలుసు. అదీ ఇలా తయారవుతున్నా కాబట్టి. ఇప్పటికైనా గుర్తించగలిగారు. లేకుంటే..." అంటూ కళ్లనీళ్లతో ఆగింది శారద.

"ఏయ్, శారూ! ఏమయింది? ఆ కన్నీళ్లేమిటి?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఇవి కన్నీళ్లు కావండీ! నేను గెలిచానో, ఓడానో తెలియని సందిగ్ధంతో వస్తున్న భాష్పాలు..." అంటున్న శారదను చూస్తే భర్త శ్రీకాంత్‌కు ఒకపక్క జాలి, మరోపక్క ప్రేమతో అల్లుకుపోయాడు. ఇక ఆ రాత్రంతా మరో శివరాత్రి అయింది. శరీరాలు రెండూ అలసిపోయాక శారద ముంగురులు సవరిస్తూ

"థాంక్యూ, శారూ! అండ్ ఐ లవ్ యూ!" అన్నాడు వదలకుండా.

అది విన్న శారద చిరునవ్వు నవ్వుతూ, "నేను ఒక్క ప్రశ్న అడుగుతాను. కోపగించుకోరుగా ...!" అంది అతని గుండెల్లో ఇమిడిపోయిన తలను బయటకు తీయకుండా.

"చెప్పు. లేదా, అడుగు! నీకు సందేహం ఎందుకు?"

"ప్రేమంటే మీ దృష్టిలో ఏమిటి?"

ఆ ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు. కానీ, బయటకు రానీయకుండా "నా దృష్టిలో నిన్ను ఇలా జీవితాంతం నాకు అతి దగ్గరగా ఉంచుకుని... ఇలాగే ప్రాణం వదిలేయడం!" అన్నాడు శ్రీకాంత్.

"అబ్బ, మన విషయం కాదండీ! అసలు జనరల్‌గా అడుగుతున్నా!" అంది మరింత దగ్గరగా జరుగుతూ.

"నాకు తెలిసిన అర్థం ఒకటేనోయ్! నీకయితే, నాకయితే ఒకటి, వేరేవాళ్లకు ఒకటి అని రెండు రకాలు నాకు తెలియవు. పోనీ నువ్వు చెప్పు!" అడిగాడు.

"నాకు తెలిసినంతవరకూ ప్రేమంటే రెండు హృదయాల స్పందన. రెండు శరీరాల కలియిక కాదు. ఏమంటారు?" సూటిగా అంది శారద.

"ఏమంటాను? ఎవరి భావం వారిది అంటాను!" నవ్వుతూ అన్నాడు.

"మరి ఇంతమాత్రానికి నన్ను అడగటం దేనికి?" అంది కోపంగా.

"నువ్వే కదోయ్ నన్ను ముందుగా అడిగింది. మరి కోప్పడతావేం?"

"నిజమే! నాదే బుద్ధితక్కువ!" అంది చలోక్తిగా.

"అది... ఇప్పటికి అర్థం అయిందన్నమాట!" అంటూ, "శారూ! నువ్వు కోపంలో కూడా మరీ అందంగా ఉంటావోయ్!" అన్నాడు మెల్లగా చెవిలో.

"చాల్లెండి!" అంది మరింత గర్వం ఉట్టిపడే స్వరంతో శారద.


000

"తెల్లవారింది, మహానుభావా! లేవండి. ఆపై ఆఫీసు టైము అయితే నా మీద చిర్రుబుర్రులాడతారు!"

"అరె... అప్పుడే తెల్లవారిందా? టైం ఎంతయింది?"

"ఏడున్నర."

వెంటనే లేచి "అమ్మో... ఈ రోజు ఎనిమిదిగంటలకల్లా అక్కడుండాలి! ఓ గాడ్!" అంటూ ఒక్క ఉదటున బాత్రూమ్‌లోకి పరుగుతీశాడు శ్రీకాంత్.



శ్రీవారి కంగారుకు నవ్వుకుంటూ బయటకు వస్తున్న శారదకు మళ్లీ అదే చూపు.

అరె... ఇతనెవరో మరీ భయం లేనట్లుంది. ఈయన ఇంట్లో ఉన్నారన్న భయం లేకుండా మరీ ఇంట్లోకే చూస్తున్నాడు. ఈయన కంటబడితే ఇంకేమైనా ఉందా? అనుకుంటూ తన అందంపట్ల మరింత నమ్మకం పెరిగిపోగా, ఆనందంతో డైనింగ్ రూమ్‌వైపు దారి తీసింది శారద మరో పల్లవిని అందుకుంటూ.

అద్దంవంక చూసుకుంటూ తల దువ్వుకుంటున్న

మిగతా 68వ పేజీలో....

# కౌన్ బనేగా ...!



స్టార్ ప్లస్ ఇటీవలనే ప్రారంభించిన కౌన్ బనేగా కరోడ్‌పతి ప్రోగ్రామ్ జనానికి ఓ వ్యసనంలా మారింది. దీన్ని అనుకరిస్తూ మరో ఛానెల్ కూడా అదే తరహా ప్రోగ్రామ్ తల పెట్టింది. ఈ కార్యక్రమం తీరుపై సరదాగా సంధిస్తున్న సెటైర్ ఇది!

'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రోగ్రామ్‌కి వచ్చిన సర్దార్జీని సాదరంగా ఆహ్వానించారు అమితాభ్ బచ్చన్.

అమితాభ్: ఎవరితో వచ్చారు మీరు?

సర్దార్జీ: మా పితాజీతో వచ్చాను.

అమితాభ్: మీ పితాజీతోనేనా?

సర్దార్జీ: అవును... అవును.

అమితాభ్: చాలా సంతోషం. మీ పితాజీ పేరు తెలుసుకోవచ్చా?

సర్దార్జీ: ఆఁ... అయితే నాలుగు పేర్లు మీరు చెప్పండి. సరైన పేరు నేను 'టిక్' చేస్తాను.

అమితాభ్: (కాస్తంత ఆలోచించి)(ఎ) చంటాసింగ్ (బి)సంటాసింగ్ (సి)డల్జీర్‌సింగ్ (డి) అజిత్‌సింగ్.

సర్దార్జీ: సంతాసింగ్... బి)సంతాసింగ్.

అమితాభ్: సంతాసింగ్.

సర్దార్జీ: అవును... సంతాసింగ్.

అమితాభ్: ఆర్ యూ కాన్ఫిడెంట్? సర్దార్జీ! మీరు మూడు లైఫ్‌లైన్‌లను వాడుకోవచ్చు. జాగ్రత్తగా ఆలోచించండి.

సర్దార్జీ: ఓకే... నేను పబ్లిక్ ఒపీనియన్ తీసుకుంటాను.

అమితాభ్: అలాగేఁ (అక్కడ కూర్చున్న ఆడియన్స్‌తో)మీ మీ ఒపీనియన్ ఇవ్వండి!

పబ్లిక్: (అందరూ వారికి తోచిన ఒపీనియన్ కంప్యూటర్‌కి ఇస్తారు.)

అమితాభ్: ఓఁ...అందరూ వారివారి నిర్ణయాన్ని తెలిపారు. దాని ప్రకారం (ఎ) సంతాసింగ్ 25% (బి) చంటాసింగ్ 25% (సి) దల్జీర్‌సింగ్ 25% (డి) అజిత్‌సింగ్ 25%. సర్దార్జీ! ప్రజల నిర్ణయం చాలా సమానంగా ఉంది. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి. మీరే ఆలోచించి ఓ నిర్ణయానికి రండి!

సర్దార్జీ: (ఆలోచనలతో...)

అమితాభ్: సర్దార్జీ! మీరు మరి ఒక లైఫ్‌లైన్ వాడుకోవచ్చు...

సర్దార్జీ: సరేఁ, నేను ఫిఫ్టీ ఫిఫ్టీ లైఫ్‌లైన్ వాడుకుంటాను.

అమితాభ్: ఓకే... ఓకే! కంప్యూటర్‌జీ! నాలుగు పేర్లలో తప్పు ఉన్న రెండు పేర్లను తీసేసుకో! (కంప్యూటర్ రెండుపేర్లను తీసేస్తుంది.) సర్దార్జీ! ఇప్పుడు రెండు పేర్లు మాత్రమే ఉన్నాయి. (ఎ)సంతాసింగ్ (బి)చంటాసింగ్...ఈ రెండు పేర్లలో మీ తండ్రిగారి పేరు ఏది?

సర్దార్జీ: (ఇంకా ఆలోచనలో ఉంటాడు.)

అమితాభ్: ఓకే... మీరు మూడవ లైఫ్‌లైన్ వాడుకోవచ్చు. ఎవరికైనా టెలిఫోన్ చేసి వారి సలహా తీసుకోవచ్చు.

సర్దార్జీ: అలాగేఁ, నేను ఫోన్ చేసి సలహా తీసుకుంటాను.

అమితాభ్: చెప్పండి. ఎవరికి ఫోన్ చేయాలి?

సర్దార్జీ: నేను మా తల్లిగారికి ఫోన్ చేయాలనుకుంటున్నాను.

అమితాభ్: తప్పకుండా... మీ తల్లిగారి పేరు చెప్పండి!

సర్దార్జీ: నాకు నాలుగు పేర్లు ఇవ్వండి... అందులో మా తల్లిగారి పేరు చెప్తాను.

అమితాభ్ : ఆఁ... ఆఁ...!

- సి.వి. రామ్·సుశాంత్

...65వ పేజీ తరువాయి

శ్రీకాంత్‌కు పక్కవాటాలోని ఆ కళ్లు కనిపించాయి. 'ఎవరితను? మన ఇంటివైపు ఏం పని?' అనుకుంటూ

"శారదా! శారదా! ఈ కిటికీ మరీ రోడ్డు కనిపించేలా ఉందని మూసేశావు కదా! మరి ఇప్పుడెవరు తెరిచారు?" ప్రశ్నించాడు.

"నేనే తెరిచాను.... నిన్న దులపబోతూ. మళ్లీ వెయ్యటం మరిచాను!" అంది సంజాయిషీగా శారద.

"పక్కవాటాలోకి ఎవరో దిగినట్లున్నారే... అయినా మరీ అలా ఇంట్లోకి చూస్తున్నాడు ఎవరు?"

"ఏమో, నాకేం తెలుసు?"

"హేయ్, మిస్టర్! ఏం చేస్తున్నావు?" గట్టిగా అరిచినట్టుగా శ్రీకాంత్.

సమాధానం లేకపోగా, "ఊరుకోండి, మీరేం గొడవ చెయ్యకండి. ఈ తలుపు వేసేస్తే సరి!" అంది అతని ఆవేశాన్ని ఆపాలని.

అయినా ఊరుకోక బయటకు దారితీశాడు. సరాసరి పక్కవాటాలోకి వెళ్లాడు కోపంతో శ్రీకాంత్.

'అయ్యో... ఈ రోజు ఈ తలుపు వేయటం మరిచిపోయాను. ఇప్పుడేం చేస్తారో ఏమో! పాపం, నన్ను ఎంతగా ఆరాధిస్తున్నాడో! అనవసరంగా గొడవ తెచ్చుకున్నాడు. ఎంతయినా తనకు జీవితంపై ఆసక్తి కలిగించిన వ్యక్తి. ఎలా అయినా ఆపాలి!' అనుకుంటూ బయలుదేరిన శారద ఎదురుగా భర్త రావటం గమనించి వెనక్కు తగ్గింది.

శ్రీవారి అసహనం గమనించిన శారద "ఏం జరిగిందండీ? ఏమయింది?" అడిగింది ఆత్రుతగా.

"ఏమీ లేదు. ముందు అన్నం పెట్టు!" బాధగా నుదురు రుద్దుకుంటూ అన్నాడు శ్రీకాంత్.

"ఇంతకీ ఏం జరిగింది అంటే వినిపించుకోరేం? అతనింటికి వెడితే ఏమన్నాడు? కొంపదీసి చెయ్యి చేసుకోలేదు కదా! మీ కసలే ముక్కుమీదే కోపం!" అంది నవ్వుతూ. విషయం తెలుసుకోవాలనే ఆత్రం బయటపడనివ్వకుండా.

"అదే జరిగింది! నేను కోపం నిగ్రహించుకోలేక కొట్టాను."

"ఆఁ, కొట్టారా? పాపం... మీకు మరీ తొందరెక్కువ! నిలబెట్టి గట్టిగా అడగాల్సింది."

"అడిగినా ఏం ప్రయోజనం? మనం ఎవరం, అడుగుతున్నామో అతనికి తెలిస్తేగా!"

"తెలిస్తేగా ... అంటే... ఎందుకు తెలియదు?" ఆశ్చర్యంగా అడిగింది శారద.

"అతనికి కళ్లు కనబడవు. పుట్టుకనుండీ అంతేనట. నువ్వు ప్రతిరోజూ బాలమురళీకృష్ణ కీర్తనలు పెడతావు కదా. అవి వింటూ తన ప్రపంచమే మరచిపోతాట్ట. అదీకాక, నీ కంఠంద్వారా జయదేవుని అష్టపదులు కూడా వింటాడట!"

ఇకపై ఏమీ వినిపించటంలేదు శారదకు. 'ప్చ్... ఎంతగా పొరపాటుపడ్డాను...' అనుకుంటూండగా ...

"వింటున్నావా, శారదా! నేను అనవసరంగా చేయి చేసుకున్నందుకు సారీ చెబుతూ రేపు ఆదివారం మన ఇంటికి భోజనానికి పిలిచాను! సరే, వెళ్లొస్తానోయ్!" అంటూ ఆఫీసుకు దారి తీశాడు.

ఇంత జరిగినా శారద, ఆ కళ్లకు కృతజ్ఞతలు తెలుపుకుంది- తన జీవితంలో ఇంతటి మార్పు తెచ్చి, తనలో ఉన్న కళకు ప్రోత్సాహం ఇచ్చి, తనపై తనకు నమ్మకం కలిగించినందుకు! ■